# గొలుసు కథ ప్రారంభం

## ఇల్లంటే ఇష్టం...



ముజ్జింశెట్టి శారద

గౌరీపతి అద్దంముందు నుంచోని డ్రస్ సరిచేసుకొంటూండగా— శారద కాఫీ కప్పుతో అతని దగ్గరకొచ్చి నిలబడింది.

'అక్కడపెట్టి వెళ్ళొచ్చు!' అన్నాడు ఆవంక చూడకుండానే.

కప్పు టేబుల్‌మీదుంచి గోడ కానుకొని నిలబడింది శారద. చీరకొంగు ఆమె వ్రేలికి చుట్టుకొని విడదీస్తోంది.

'నా మొహంలో సినిమా ఆడుతోందా? అలా చూస్తున్నావ్?'

'ఊహు!...అబ్బే... ఏం లేదండి!' అందామె తడబడి.

'అయితే లోపలికి దయచేయవచ్చు...' మెల్లగా లోనికి నడిచిందామె.

అతను వడివడిగా బయటికి నడువబోతూంటే ప్రక్కగదిలోనుంచి ఆమె వెక్కివెక్కి ఏడవడం వినిపించింది. ఆమె గదిలోకి నడిచి 'ఎప్పుడూ నెత్తిన నీళ్ళు కుండేనా? నాన్సెన్స్! ప్రాణానికి శనిలా దాపురించావ్! ఏం? ఎందుకు? నీకేం తక్కువయిందని ఏడుపు?...ఏం తక్కువ చేశానని?...' తీవ్రంగా అడిగాడు గౌరీపతి.

చెంపలమీదనుంచి జారుతోన్న కన్నీటిని చీర చెంగుతో తుడుచుకొందామె. కంటి కాటుక, కళ్ళ చుట్టూ పులుముకుపోయింది. అతని కళ్ళల్లోకి ఓ క్షణం చూసి వెంటనే తలదించుకొందామె. గౌరీపతి తనలో తనే సర్దుకోడానికి ప్రయత్నించాడు.

'పోనీ...పోనీ చెప్పెయ్యరాదూ? నీ కిష్టం లేకపోతే ఇంటికి రావడం మానేస్తాను...' శారద మాట్లాడలేదు. ఉబికి వస్తోన్న దుఃఖాన్ని మింగడానికి విశ్వ ప్రయత్నం చేస్తోంది.

'నాకోసం కనిపెట్టుకు కూర్చోవద్దు. నువు భోజనం చేసెయ్!' అనేసి బయటికి నడిచాడు. అతను కనుమరుగవగానే మంచంమీద కూలబడి బిగ్గరగా ఏడ్చేసింది శారద.

గౌరీపతి త్వరత్వరగా నడిచి శంకర విలాస్ హోటలుకు చేరుకొన్నాడు. ఓ టేబుల్ ముందు కూలబడి భోజనం చేస్తూండగా ప్రక్కకుర్చీ అతను అన్నాడు: 'మాంచి ఆకలిగా వున్నట్లున్నారు. ప్రక్కన ఎవరుందీ కూడా చూడ్డంలేదు...'

అతనివంక చూసి ఆశ్చర్యపోయాడు గౌరీపతి. అతను శంకర్రావు. తోటి లెక్చరరూ, మంచి స్నేహితుడూనూ.

'మీరా! పరధ్యానంలో ఉండిపోయాను. ఇదివరకే నిన్నసలు కనిపించనేలేదు ఎటు వెళ్ళేశారు?' నవ్వుతూ అన్నాడు గౌరీపతి.

'నిన్న కొంచెం పనిమీద తిరిగానులెండి ...అన్నట్లు మీ శ్రీమతి కేరాఫ్ పుట్టిల్లేమిటి? ఈ వరకానికి వెంచేశేరు?'

'అహ! కాదండీ!—ఊట కాలక్షే— అయితేనూ...'

* * *

సోమయాజులు రోజూకన్నా చాలా హుషారుగా వున్నాడు. ఈలపాట పాడుతూ 'గదంతా కలయతిరిగి సరస్వతి బట్టలన్నీ

పెట్టెలోకి బెడ్డింగ్‌లోకి సర్దుతున్నాడు. సరస్వతి లోపలి దిగులు కనిపించనీకుండా అతనికి సాయపడుతోంది.

'సరూ'! వాటర్‌బాటిల్‌కూడా తీసుకుపో! రైల్లో దాహంవేస్తే కష్టం మరి...' అన్నాడు.

ఆమె లోనికివెళ్ళి వాటర్‌బాటిల్ తీసుకొచ్చి అతని కందించింది. అది ప్రక్కన పెట్టి, సరస్వతి రెండుభుజాలపై చేతులు వేసి అడిగాడతను.

'ఎందుకలా వున్నావ్? వెళ్ళిపోతున్నాననా?...'

'ఊహు! అదికాదండీ!...ఏంలేదు...' అంది సరస్వతి నవ్వడానికి ప్రయత్నిస్తూ.

'హాయ్‌హాయ్! ఏం బ్యూటిఫుల్‌గా కోపశావు!...ఎంతలోకి? ఇట్టే గడిచిపోతాయి ఆర్నెల్లు. నేను సినిమాకి రమ్మంటే నువ్వు మేకప్ అయేంతసేపు. ఏం?...అవునా? ఇక ఆపోజు తీసెయ్! త్వరగా తయారవు! బండికి టైమవుతోంది. నేనలా వెళ్ళి రిక్షా తీసుకొచ్చేస్తాను...' బయటకి నడిచాడతను.

సరస్వతి మధ్యతరగతి కుటుంబానికి చెందిన అమ్మాయి. అందుచేత మధ్యరకం చదువే చదివింది. ఇంకా పైకి చదువుతానని గొడవ చేసిందికానీ, వాళ్ళనాన్న విన్లేదు. 'పైచదువులు పైవాళ్ళగ్గానీ, మనకెందుకు? నువ్వేం మినిష్టరవుతావా?

# నీలాంటి ఒకరు...

యం. పి. అవుతావా' అంటూ కోప్పడ్డాడు.

కోప్పడి ఊరుకొంటే లాభంలేదని పెళ్ళిచేసి పారేశేడు. చాలామంది లాగే కూతురు పెళ్ళయిన మర్నాడే ఇల్లమ్మి దివాలా తీశేడు. ఇంట్లో అందరూ ఓ పూటే భోజనంచేసి రెండోపూట 'మంచి సంబంధం చేశామన్న' సంతృప్తిని త్రాగి నిద్రపోతున్నారు. సంవత్సరానికి ఆరునెల్లు ఇలాంటి పుట్టింట్లో గడపాలంటే సరస్వతికి ప్రాణంమీది కొస్తోంది. ఈ ఆరు నెలలు జీవితం చక్కెరలేని కాఫీ డికాషన్ త్రాగినట్లుంటుందామెకి. కానీ తప్పదు: సోమయాజులు డాక్టరు సరస్వతి పేషెంట్. పేషెంట్‌ని విపరీతంగా ప్రేమించే డాక్టరతను. అందుచేత తనకిష్టం లేకపోయినా అతని కనుగుణ్యంగా నడుచుకోక తప్పటం లేదు.

సరస్వతి ప్రపంచాన్ని చాలావరకూ చదివి తెలుసుకొంది. మిగిలిన కొంచెం చూసి తెలుసుకొంది. అయితే ఆ అమ్మాయిచదివీ, చూసినంత వరకూ సోమయాజుల్లాంటి మనుషులెక్కడా తటస్థపడలేదు. అతనితో వివాహం అయేంత వరకూ అసలలాంటి వారుంటారనే అనుమానంకూడా కలుగలేదు.

సోమయాజులు సరస్వతిని చాలాగాఢంగా ప్రేమిస్తాడు. ఆమె అడిగిందీ, అడగనిదీ కూడా నిమిషాల్లో సమకూరుస్తాడు. కాలేజీ టైము తప్పితే, మిగతా కాలమంతా సరస్వతితో మాట్లాడుతూ ఇంట్లోనే కాలం గడుపుతాడు. ప్రతి సినిమాకీ మొదటి వారంలోనే ఆమెని తీసుకుపోతుంటాడు. ఆమె వంట్లో కొస్తంత నలతగావుంటే, ఏపనీ ముట్టనీకుండా తనే అన్ని పరిచర్యలూ చేస్తాడు. కాని ఇదంతా సంవత్సరానికి ఆరు నెలలు మాత్రమే. మిగతా ఆరునెలలూ ఆమెకి చీకటిరోజులు. ఆమె అభిప్రాయంతో ఏమాత్రం పనిలేదన్నట్లుగా ఆమెని పుట్టింటికి పంపించేస్తుంటాడు. తనను లేకుండాచేసి అతను గడిపే జీవితమేమిటో సరస్వతి ఎప్పుడూ చూళ్ళేదు. అతనిని అడగనూ లేదు. కాని ఊహించుకొంది. స్నేహితులు, సిగిరెట్ పొగలూ, పేక ముక్కలూ, బాటిల్స్‌లోని నిషాలూ — తనకిచ్చే ట్రీట్‌మెంట్‌కి నవ్వుకోవాలో, ఏడవాలో కూడా తెలియడం లేదామెకి.

రిక్షాతో సహా తిరిగొచ్చాడు సోమయాజులు.

'ఏం? రడీయేనా?...'

'ఓ! అయిపోయిందండీ! ఒక్కమాట ...మీరు హోటల్లో భోజనం చేయొద్దు. ఆరోగ్యం పాడవుతుంది. బద్ధకించిన రోజన పని అవ్వతోనే నాలుగు మెతుకులు వండించుకోండి...'

'అలాగే మహారాణిగారూ!...'

బయటకి నడుస్తోంటే ఎందుచేతనో ఆమె కళ్ళు చెమ్మగిలినయి.

'ఏమిటే, మళ్ళీ ఆగావు?'

'ఫ్లాస్కులో కాఫీ వుంచాను...'

'సరేలేవే! ఆత్మహత్యయినా చేసుకొంటానుగానీ హోటల్లో కాఫీ త్రాగను. సరేనా! ఇహ పద...చాలా కొద్ది టైముంది.'

ఆమె రిక్షాలో కూచుంది. తల్పు తాళంవేసి అతనూవచ్చి ఆమె ప్రక్కన కూర్చున్నాడు. స్టేషన్ చేరుకొనేప్పటికి రైలు అప్పటికే ప్లాట్‌ఫారంమీద ఆగి వుంది. త్వరగా ఆమెని ఆడాళ్ళ పెట్టెలో ఎక్కించి కిటికీ దగ్గర కూచున్నాడతను.

'ఏమండీ?'

'ఏమిటండీ?'

'అన్నాళ్ళు పుట్టింట్లో వుండాలంటే నా కేమిటోగా వుందండీ! చివరకి వాళ్ళ గ్గూడా లోకువయిపోతానేమో!...'

'ఛః మీ నాన్న అలాంటివారుకాదు.



నాకు తెలుసుకదా! ఆ విషయంలో నువ్వేమీ బాధపడకు...'

గార్డు విజిల్ వేశాడు.

'ఏమండీ!' మళ్ళీ పిలిచింది సరస్వతి.

'మళ్ళీ ఏమిటి?...' నవ్వుతూ అడిగాడతను.

తలదించుకుని ఊరుకుండి పోయిందామె. బండి కదిలింది

'పిల్చి వూరుకొన్నావేం? ... ఏమిటో చెప్పెయ్...'

'నన్ను వీలయినంత త్వరగా తీసుకొచ్చేయండి!...నేను...నే నిప్పుడు ఉత్త మనిషినికూడా కాదు...'

'యూ సిల్లీగాల్! చెప్పవేంమరి?...' ఆమెచేతిని గట్టిగా నొక్కేడతను. బండి వేగం అందుకొంది. అతను ఆగిపోయాడు.

సరస్వతి కంటివెంబడి బొట బొటా కన్నీటిచుక్కలు రాలినయి.

స్టేషన్ బయటి కొచ్చింతర్వాత చాలా ఫ్రీగా ఫీలయ్యాడు సోమయాజులు మనసంతా ఉల్లాసంగావుంది. చకచక మార్కెట్‌వేపు అడుగులు వేశేడు.

'హల్లో! యాజులూ!' అంటూ పలుకరించేడు సత్యం.

సోమయాజులు అభిరుచుల్ని మెచ్చుకుని, చాలావరకూ అనుసరిస్తున్న వారిలో సత్యం మొదటివాడు. అతనికో లంకంత ఇల్లూ, లంకిణిలాంటి భార్యా, బోలెడాస్తీ ఉన్నయి. అతనికీ, లంకిణికీ ఓక్షణంకూడా పడదు. ఎప్పుడయినా ఓ క్షణం మాట్లాడాల్సిన పరిస్థితేర్పడితే అతని దురలవాట్ల గురించి ఆవిడా, ఆవిడ పిచ్చి వ్యవహారాల గురించి అతనూ దెప్పిపొడుచుకునే వాళ్ళు. సోమయాజులు తన సరదాలు తీర్చుకొనే అన్నిరోజులూ ఇంచుమించుగా అతని ఇంట్లోనే మకాం పెట్టేస్తాడు సత్యం.

'సత్యం! ఇవాళ ప్రారంభోత్సవం! మన కంపెనీ ఆంతట్నీ, సాయంత్రానికల్లా కొట్టుకొచ్చెయ్! ఈలోగా నేను ఎరేంజ్‌మెంట్స్ చేస్తాను...' అన్నాడు సోమయాజులు. కెవ్వుమని నవ్వాడు సత్యం 'గ్లాడ్ న్యూస్ గురూజీ! ఈ మధ్యన సరయిన కంపెనీలేక 'బోర్' కొట్టేసిందనుకోండి! మరి ఇవాళ మీ కాలేజీ మాటేమిటి?'

'ఇప్పుడక్కడికే పోతూంట! కుర్రాళ్ళని సినిమాకిపొమ్మని చెప్పేసివస్తా!...'

'ఓ. కే...' అంటూ వెళ్ళిపోయాడు సత్యం.

కొద్ది దూరంలోనేవున్న ఓ మెడికల్ షాపులోకి నడిచాడు సోమయాజులు. ఎవరికే మందు కావాలన్నా అది ఆ షాపులో లభిస్తుంది. సోమయాజులుకి కావల్సిన మందు ఈ ఒక్క షాపులోనే దొరుకుతుంది.

అతన్ని చూడగానే 'నమస్తే సార్! ఈ మధ్యన శీతకన్నేశారు మామీద...' అన్నాడు మేనేజరు నవ్వుతూ.

'అవునయ్యా! మా కన్నేద్దామంటే వీల్లేకపోయింది. అంచేత శీతకన్నే సర్దాం ప్రస్తుతానికి, సరుకుందా?...'

'ఓ, బెస్ట్‌స్టఫ్! నిన్నే షిప్‌నుంచి తెచ్చాం! ఏదికావాలో చెప్పండి?...'

'డిప్లొమేట్ ఆరు ఫుల్‌బాటిల్సు ... బీరుకూడా ఓ అరడజను ... సాయంత్రం వచ్చి తీసుకుపోతాను.'

'అలాగేసారే! రడీగా వుంచుతాను...'

'ఇదొకరకం పిచ్చి! ఇక ఆర్నెల్లవరకూ అద్భుతంగా వెలుగుతాడు ...' అన్నాడు షాపులో గుమాస్తా సోమయాజులు వెళ్ళగానే.



# నీలాంటి ఒకరు...

సోమయాజులు కాలేజికి చేరుకొనేసరికి ఫస్ట్‌బెల్ అవుతోంది. అతన్ని చూడ గానే స్టాఫ్ రూమ్‌లోనుంచి సీతాపతి, దాసూ, ఇద్దరూ పిలిచేరు.

'నీ గురించే చూస్తున్నామోయ్! సాయంత్రం ప్రోగ్రాం వుందో లేదోనని... అంతా రడీయేనా ?'

'మనం ఒహటి అనుకోవడమూ, అది కాకపోవడమూనా ? ఫైవోక్లాక్కల్లా ఇంటికొచ్చేయండి...'

క్రొత్తగా చేరిన కుర్ర లెక్చరరు వీళ్ల మాటలు ఆశ్చర్యంగా వింటున్నాడు.

'ఏమిటిసార్! డిటెక్టివ్ నవలలో లాగా ఏదో 'కోడ్' మాట్లాడుతున్నారు. అదేదో చెప్తే నేనూ వస్తానుగదా!...'

ముగ్గురూ ఫెుల్లున నవ్వారు.

'కోడ్' అన్నతరువాత అదింక అంతే బాయినా! అర్థంచెప్పరు. సాయంత్రం మా వెంబడివస్తే నీకే తెలుస్తుంది...'

దూరంగా కూర్చున్న ఓ లెక్చరరు ప్రక్కాయన చెవిలో గొణిగాడు.

'పాలెపురుగు మళ్లీ గూడు అల్లుతోంది. ఏమీ తెలియని రాజారావుకూడా నాశనమయేట్లున్నాడు...'

ఫస్టవర్ తర్వాత సోమయాజులు లైబ్రరీ హాలునుంచి బయటికొస్తుంటే శంకర్రావు, గౌరీపతి అతని కెదురయ్యేరు.

'గుడాఫ్టర్ నూన్...' అన్నాడు సోమయాజులు నవ్వుతూ.

ఇద్దరూ అతనికి విష్‌చేశారు.

'గౌరీపతిగారూ! విశేషాలేమిటి ?... మరు 'ఎంప్టీ కాన్వాస్' నావెల్ కావా లన్నారుగదూ! సాయంత్రం ఇంటికిరండి. తీసుకు పోదురుగాని ... వేరే పనేమీ లేదుగదా!' వెంటనే శంకర్రావు అందు కొన్నాడు.

'సారీ మిష్టర్ సోమయాజులూ! సాయంత్రం గౌరీపతికి మా యింట్లో ఓ చిన్న 'టీ' పార్టీ ఇద్దామనుకొంటున్నాను. రేపు కాలేజీ కొచ్చేప్పుడు నువ్వే ఆ నావెల్ తీసుకు రావచ్చుగదా!...'

'అఫ్ కోర్స్! బ్రహ్మాండంగా తీసుకు రావచ్చు. తెస్తాను. కానీ నాకూ నీలా నే దుర్బుద్ధి ఉండొచ్చుగా...ఆయనని 'టీ'కి పిలవాలనీ!...'

'అలాగే! కానీ ఇవాళ ప్రోగ్రాం నాది...' నవ్వుతూ అన్నాడు శంకర్రావు.

'బాపుందండోయ్! నాకు తెలీకుండా ఎందుకు 'టీపార్టీ' ఇస్తున్నట్లు మీరూ?' శంకర్రావునుద్దేశించి అన్నాడు గౌరీపతి.

'ఇదేం డిన్నర్‌కాదుగదా ప్రిపరేషన్ మేష నివ్వడానికి...పదండి పోదాం...' ముందుకి నడిచాడు శంకర్రావు. గౌరీపతి అతనిని అనుసరించ బోయాడు.

'అట్లయితే రేపు వస్తారనుకొంటాను...' అన్నాడు సోమయాజులు.

'ఇవాళ్టికి మమ్మల్ని పోనీయవయ్యా! మహానుభావా రేపటిసంగతి రేపే చూచుకో వచ్చు...పదండి గౌరీపతిగారూ...' అన్నాడు శంకర్రావు ఆగకుండానే.

'వస్తానండీ!' తనూ నడిచాడు గౌరీపతి.

ఓ క్షణం వాళ్ళవంకే నవ్వుతూ చూసి వెనుదిరిగేడు.

త్రోవలో శంకర్రావు అన్నాడు.

'సోమయాజులు గురించి మీకు పూర్తిగా తెలీదనుకొంటాను గౌరీపతిగారూ! ఉట్టి వ్యసనాల మనిషి. మీరు అతనికి ఏవిధం గానూ చేరువవ్వడం నాకిష్టంలేదు. ఇందాక అతని ఇంటికి మిమ్మల్ని ఆహ్వానించి నప్పుడు, అందుకే మాయింట్లో టీపార్టీ ఉందని అబద్ధమాడేను. తన సరదాల గురించి దేనికీ వెనుదియ్యడు. అంతగా దాసుడయిపోయాడు వాటికి. మీరు నాకు మంచి స్నేహితులవడంమూలాన బ్రతిమాలి చెప్తాను. ప్లీజ్! వీలయినంతవరకూ అతనితో మాట్లాడ్డంగూడా 'ఎవైడ్' చెయ్యండి!...'

గౌరీపతి నవ్వేడు.

'భలేవారే మీరు. నేనో చిన్న పాపాయి గాణ్ణనుకుంటున్నారా ఒకళ్లమాటలు విని చెడిపోడానికి...'

లైబ్రరీనుంచి పుస్తకాలు తీసుకొని వచ్చేప్పుడు అడిగాడు శంకర్రావు.

'సాయంత్రం క్రొత్తపిక్చరొహటి రిలీజవుతుంది. వెళ్దామా?'

'సారీ సర్! ఈవినింగ్ కొంచెం షాపింగ్ వుంది. మరోసారి పోదాంలెండి...'

* * *

శేష్‌మహల్‌లో ఫస్ట్ షో జరుగుతోంది. సినిమా చూసేజనం చాలా విపరీతమయిన బాధపడుతున్నారు. హీరోయినూ, ఆమె కజిన్ సిస్టరూ ఇద్దరూ ఒకణ్ణే ప్రేమించారు. ఇప్పుడెలాగా అని హాల్లో అందరూ సతమతమవుతున్నారు. ఇంటర్వల్ అయింది. శంకర్రావు బయటికొచ్చి సిగరెట్ వెలిగించాడు.

'ఇప్పుడేమవుతుందో...' సోడా త్రాగుతూ ఓ గిరజాలవాడు ప్రక్కవాణ్ణడిగాడు.

'హీరోయిను తన ప్రేమని త్యాగం చేసవతల పారేస్తుంది...' ప్రక్కవాడు బీడీ వెలిగించుకొని జవాబిచ్చాడు.

'నీకెలా తెలుసు?...' ఆశ్చర్యంగా అడిగాడు గిరజాలు.

'ఓస్! ఈమాత్రం తెలీదేమిటి? అదివరకు పిక్చర్లోకూడా అలాగే చేసింది...' శంకర్రావుకి నవ్వువచ్చింది. ఇంకానయం! నిన్న మాట్నీలో కూడా అలాగేచేసింది' అన్నాడుకాదు! లోపలికినడిచి సీట్లో కూలబడ్డాడు. అప్పటికే సినిమా బిగినయి పోయింది.

'రాజా! నీకు నామీద ఏమాత్రం ప్రేమున్నా నన్ను మర్చిపోకు. మా చెల్లిని పెళ్లిచేసుకొని సుఖంగా జీవించు...' అంటూ హీరోయిను ఇంట్లోకెళ్ళిపోయింది.

'నాగుండెల్లో సోడాకొట్టావు జయా!' అంటూ ప్రక్కకి వెళ్ళిపోయాడు హీరో.

'ఈ సిన్మాకి సోడాలమ్మే అతను డైలాగులు రాసినట్లున్నాడు...' ముందు కూర్చున్న స్టూడెంట్ అన్నాడు. మరి కొంచెంసేపుండి 'బోర్' కొట్టి బయటి కొచ్చేశాడు శంకర్రావు. సన్నగా వానచినుకులు పడుతున్నాయి. సినిమా 'బోర్' కొట్టడం మంచిదయిపోయింది. వర్షం పెద్దదవకముందే ఇల్లుచేరుకోవచ్చు...నడుస్తూండగానే వర్షం పెద్దదయింది. రోడ్డుప్రక్కనే వున్న పెంకుటింటి అరుగు



మీద నుంచున్నాడు శంకర్రావు. ఇంటిలో చాలా సందడిగావుంది. ఉండుండి పెద్దగా నవ్వులు వినబడుతున్నాయి. ఓ గొంతు సన్నగా ఇంగ్లీషుపాట ఒకటి ఆలాపిస్తోంది.

'ఇట్ హాజ్ బీన్ ఎ హార్డ్ డేస్ నైట్,
ఎండ్ ఐహావ్ బీన్ వర్కింగ్ లైక్ ఎ డాగ్.
ఇట్ హాజ్ బీన్ ఎ హార్డ్ డేస్ నైట్,
ఐషుడ్ బి స్లీపింగ్ లైక్ ఎ డాగ్...'

ఉలిక్కిపడ్డాడు శంకర్రావు. అది గౌరీపతి గొంతు. వెంటనే తలుపుసందులోనుంచి లోపలికి తొంగిచూశాడు. గది మధ్యలో కొంతమంది కూచొని పేకాడుతున్నారు. వాళ్లల్లో సోమయాజుల్ని మరి ముగ్గురు తమ కాలేజీ లెక్చరర్లని గుర్తించాడు. సోమయాజులు ప్రక్కగా గౌరీపతి గోడకి చేరగిలబడి కూచున్నాడు. వర్షం మరి కొంచెం పెద్దదయింది. అయిదు నిమిషాలు గడిచినయి. గౌరీపతి ఇంగ్లీష్‌పాట ఆగిపోయింది.

'మిష్టర్ సోమయాజులూ! నాకింకా త్రాగాలని వుంది. ప్లీజ్! ఒక్క గ్లాసుడు ఇవ్వరూ?'

సోమయాజులు వికృతంగా నవ్వాడు.

'త్రాగవోయ్! ఇదిగో! నా బాబాకూడా త్రాగెయ్! ఇక్కడికీ చాలకపోతే మరో బాటిల్ ఓపెన్ చేద్దాం! నేను చాలా మంచాణ్ణి. నువ్వు సుఖపడటమే నాకానందం. ఎంచేతనంటే నా నుదుట అది వ్రాయబడలేదు.'

'థ్యాంక్యూ సోమయాజులూ! వెరీ కైండాఫ్ యూ!'

తూలుతూ మాట్లాడుతున్నాడు గౌరీపతి.

మరోక్షణం కూడా అక్కడ ఉండబుద్ధికాలేదు శంకర్రావుకి. వర్షంలోనే తడుస్తూ నడవసాగేడు. మనసంతా అల్లకల్లోలంగా తయారయింది.

మర్నాడు గౌరీపతి శంకర్రావు కాలేజి కాంటీన్‌లో కాఫీ త్రాగుతున్నపుడు ఓక్షణం తటపటాయించి శంకర్రావు అన్నాడు.

'మిమ్మల్ని రాత్రి సోమయాజులింట్లో చూశాను...'

ఏమాత్రం తొణక్కుండా జవాబిచ్చాడు గౌరీపతి.

'శంకర్రావుగారూ! మీకు నామీద గల అభిమానానికి కృతజ్ఞుణ్ణి. కానీ నాకతని వదంతులు బాగా నచ్చాయి...'

(రెండోభాగం వైహారం)


ఋతుక్రమం ఆలస్యమైతే?
విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన "దేవిపిల్సు" వాడండి




పూర్తికోర్సుప్యాకెట్టు 28 మాత్రలువెల రు||
సగంకోర్సు ప్యాకెట్టు 14 మాత్రలువెల రు
ప్రతిచోటదొరకును

"దేవి పిల్సు" ముఖ్యంగా ఆలస్యమైన, క్రమముగాకాక పోయిన, బాధతో కూడిన, లేక ఆగిపోయినబహిష్టకుదేవిపిల్సు బాగుగ గుణమిచ్చును

1 అన్ని సందర్భములలోను శీఘ్రముగాను, అమోఘముగాను పనిచేయును
2 ఏస్థితిలోను ఆరోగ్యమునకు ఎట్టిహాని కలిగింపదు.

MFRS :- SEENU & CO., MADRAS-2!

ప్రఖ్యాతి కెమిస్టులు మరియు డ్రగ్గిస్టు లందరి వద్ద లభించును.
Advt. Permitted under G.O MS. No. 1121



ఏజెంట్లు కావలెను

విదేశములనుండి దిగుమతి కాబడిన — ప్రపంచ ప్రఖ్యాతి గల — చేతి గడియారములను మేము మిక్కిలి తక్కువ ధరలకు మీకు అమ్మగలము. కొద్ది స్టాకు మాత్రమే గలదు. మా కేటలాగునకు, యేజెన్సీ షరతులకు వ్రాయండి. ఉచితముగా పంపెదము.

INDO TRADING CORPORATION

289/91, Nagdevi Street, Bombay-3.